ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 3 సెప్టెంబరు 2024




నేడు మెగా జాబ్‌మేళా: కలెక్టర్

కలెక్టరేట్, సెప్టెంబరు 2: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మంగళవారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. జాబ్‌మేళాలో తొమ్మిది స్థానిక, బహుళజాతి ప్రైవేటు సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. పదోతరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగినవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్వో అప్పారావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, ఉపకలెక్టర్ రామ్మోహనరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయిశ్రీనివాస్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, జిల్లాఉపాధి అధికారి కె.సుధ పాల్గొన్నారు.

ఉద్దానంలో కిడ్నీవ్యాధిపై పరిశోధన

- ప్రతి వందలో 21 మందికి జబ్బు లక్షణాలు
- ఈకోలై బ్యాక్టీరియాపై అనుమానాలు
- కొలంబియా వర్సిటీ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో పరిశీలన
- 'పలాస' కేంద్రంలో ఐదు రోజులు సిబ్బందికి శిక్షణ



కిడ్నీ పరిశోధన కేంద్రం

పలాస, సెప్టెంబరు 2: ఉద్దానం గ్రామాల్లో కిడ్నీ వ్యాధి కారకాలపై అమెరికాకు చెందిన కొలంబియా యూనివర్శిటీ పరిశోధన ప్రారంభించింది. ఈ మేరకు ఆ యూనివర్శిటీ ప్రొఫెసర్, పర్యావరణ శాస్త్రవేత్త లెక్స్‌వెన్‌గేన్ సోమవారం పలాసలోని పద్మనాభపురంలో కిడ్నీ పరిశోధన కేంద్రం-200 పడకల ఆసుపత్రికి వచ్చారు. కిడ్నీ వ్యాధులపై అధ్యయనం చేస్తున్న 'ది గ్లోబల్ ఇనిస్టిట్యూట్' సిబ్బందికి ఐదు రోజులపాటు ఇచ్చే శిక్షణ ప్రారంభించారు. కిడ్నీవ్యాధి వ్యాప్తికి ఈకోలై బ్యాక్టీరియా కూడా ఒక కారణమని అనుమానిస్తున్నారు. దీనికి సంబంధించి అమెరికా నుంచి తెచ్చిన 120 టెస్టింగ్ కిట్లతో నమూనాలు సేకరించనున్నారు. స్థానిక పరిశోధన కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇక్కడ సాధ్యం కానివాటి నమూనాలు అమెరికా తరలించి.. అక్కడే వివిధ సూక్ష్మస్థాయి పరీక్షలను నిర్వహిస్తారు. మొత్తం వ్యాధి నిర్ధారణ పరీక్షలు పూర్తి చేయడానికి మరో రెండున్నరేళ్లు పడుతుందని శాస్త్రవేత్తలతో పాటు గ్లోబల్ ఇనిస్టిట్యూట్ వైద్యాధికారి డాక్టర్ జి.బాలాజీ విలేకరులకు వెల్లడించారు.

● పరీక్షల నిర్వహణ ఇలా..

అమెరికా నుంచి ఆధునిక పరిశోధనకు అవసరమయ్యే కిట్లు పలాస కిడ్నీ ఆస్పత్రికి ప్రత్యేక కంటైనర్లలో చేరుకున్నాయి. పరిశోధన కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ నిర్వహణ సంస్థ (అమెరికా) రూ.7.5 కోట్ల మేర నిధులు కేటాయించింది. కొద్ది నెలల కిందట ప్రభుత్వం నిర్వహించిన సర్వే తరహాలో ఉద్దానం కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో మొత్తం 2500 మందికి రక్తనమూనాలు సేకరించారు. వీటిలో ఆశ్చర్యకరంగా ప్రతి వంద మందిలో 21 మందికి కిడ్నీ వ్యాధి లక్షణాలు కనిపించాయి. దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొలంబియా యూనివర్శిటీ పర్యావరణ విభాగం, నెఫ్రాలజీ విభాగాలకు నివేదిక పంపించగా అత్యవసరంగా గుర్తించి ర్యాండమ్ సర్వేకు ఆదేశించారు. దీని ప్రకారం ఉద్దానంలోని ఎంపిక చేసిన గ్రామాల్లో మట్టి, ధూళి, నీరు, ఫ్లోరైడ్, ఐరన్ వంటి కారకాలపై సూక్ష్మ పరిశీలన చేస్తారు. ఈ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంబంధిత కిట్లు వినియోగంపై మొత్తం 16 మందికి శిక్షణ ఇస్తున్నారు. నమూనాల సేకరణ, వాటిని పరీక్ష కేంద్రాలకు ఎలా తరలించాలనే అంశాలు ఇందులో ఉన్నాయి.



కొత్త టెక్నాలజీతో రక్త నమూనాలు తీసి ఈ శ్యాంపిల్ బాటిళ్లలో వేస్తారు. అనంతరం టెస్టింగ్ చేసి అందులో కిడ్నీ వ్యాధి కారకాలు గుర్తిస్తారు.

పరిశోధన కిట్ల వినియోగంపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త లెక్స్‌వెన్‌గేస్

● తొలిసారిగా..

ఇప్పటివరకూ కిడ్నీ వ్యాధులపై సర్వే నిర్వహించిన వివిధ ప్రభుత్వాలు, సంస్థలు అనేక విషయాలు వెల్లడించాయి. అయితే మొదటిసారిగా వ్యాధికారకాల పరిశోధనపై అడుగులు వేయడం విశేషం. అమెరికాకు చెందిన కొలంబియా యూనివర్శిటీ పర్యావరణ శాస్త్రవేత్త ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ వ్యాధి కారకాలపై అధ్యయనం చేసి వ్యాధి తగ్గుదలకు నేతృత్వం వహిస్తున్న 'ది గ్లోబల్ ఇనిస్టిట్యూట్' ఈ కార్యక్రమం నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. మొత్తం అధ్యయనానికి రూ.కోట్లు ఖర్చు కానుంది. తొలివిడతగా స్వచ్ఛంద సంస్థలు ఇచ్చిన నిధులతో మొదటి అధ్యయనానికి శ్రీకారం చుడుతోంది. కొద్దిమందికి, కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఈ నిధులు సరిపోతుంది, మిగిలింది రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలు ముందుకొస్తే మొత్తం పరిశోధన పూర్తవుతుందని నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.



నీటిలో ఇకోలమ్, నైట్రేట్, ఐరన్, హెవీ మెటల్, పురుగుల మందులు ఉన్నాయో లేదో కొలిచే పరికరాలు ఇవి. నీటిని సేకరించి అందులో వేసిన తరువాత వాటి రంగుల బట్టి అవశేషాల శాతం తెలుస్తుంది.

పరిశోధన చేసి వివరాలు అందిస్తాం

కిడ్నీ వ్యాధి కారకాలపై మేము పరిశోధనలు చేసి యూనివర్శిటీకి వివరాలు అందిస్తాం. వ్యాధి ఎలా వ్యాప్తి చెందింది.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు ప్రభుత్వానికి సూచనలు చేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో ఉన్న కిడ్నీ వ్యాధులపై ఇటువంటి పరిశోధనలు విజయవంతంగా చేశాం. ఇక్కడ కూడా అదేరీతిలో చేస్తాం. మొత్తం పరిశోధనకు కొంత సమయం పడుతుంది.

- లెక్స్‌వెన్‌గేన్, కొలంబియా యూనివర్శిటీ పర్యావరణ శాస్త్రవేత్త



జడ్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బొడ్డపాడు రైతులు

మా భూములు లాక్కున్నారు

- నష్టపరిహారంలోనూ పది శాతం కమీషన్ వసూలు
- మాజీమంత్రి సీదిరి అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు
- న్యాయం చేయాలంటూ బొడ్డపాడు రైతుల ఆందోళన

కలెక్టరేట్/ పలాస రూరల్, సెప్టెంబరు 2: వైసీపీ నేత, మాజీమంత్రి సీదిరి అప్పలరాజు భూ అక్రమాలను వ్యతిరేకిస్తూ.. పలాస మండలం బొడ్డపాడు రైతులు ఆందోళన చేశారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన 'మీ కోసం' వేదికగా సీదిరి అక్రమాలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. 'మేము తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూమిని బలవంతంగా లాక్కున్నారు. నష్టపరిహారం అడిగే రైతులు, మహిళలపై దాడులు చేసి.. తప్పుడు కేసులు బనాయించారు. నష్ట పరిహారం చెల్లింపులోనూ పదిశాతం కమీషన్ వసూలు చేశారు' అని రైతులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. 'వైసీపీ హయాంలో అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు.. పలాస మండలం బొడ్డపాడులో వందేళ్ల నుంచి ముగ్గురు రైతుల సాగులో ఉన్న 1.20 ఎకరా భూమిని జగనన్న కాలనీ కోసం సేకరించారు. కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించలేదు. 10శాతం కమీషన్ ముందుగా చెల్లిస్తేనే నష్ట పరిహారం చెక్కులు అందుతాయని మంత్రి సీదిరి ఏర్పాటు చేసిన పంచనామా కమిటీ సభ్యులు వసూళ్లకు పాల్పడ్డారు' అని రైతులు ఆరోపించారు. ఈ చెల్లింపులకు సంబంధించి ముందుగానే ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు పెట్టించుకున్నారని తెలిపారు. పది శాతం కమీషన్ చెల్లించినా.. ఆ పత్రాలు వెనక్కి ఇవ్వలేదని వాపోయారు. నష్ట పరిహారం చెల్లించకుండా జగనన్న కాలనీకి పట్టాలు కేటాయించడంపై హైకోర్టులో పిటీషన్ వేయగా స్టేటస్‌కో ఆర్డర్ వచ్చిందని తెలిపారు. అయినా అప్పటి తహసీల్దార్ ఆదేశాలతో కొంతమంది వైసీపీ కార్యకర్తలకు, అనర్హులకు ఇళ్ల పట్టాలను అందజేశారని ఆరోపించారు. అలాగే జగనన్న స్మార్ట్ సిటీ పేరుతో 135 మంది రైతుల నుంచి 150 ఎకరాలను తీసుకున్నారని పేర్కొన్నారు. ఎటువంటి నష్ట పరిహారం రైతులకు చెల్లించకుండా, 10శాతం కమీషన్ పద్ధతిని అవలంభిస్తూ సీదిరి అప్పలరాజు, పంచనామా కమిటీ సభ్యులు తమను దోచుకున్నారని రైతులు ఆరోపించారు. ఆ భూముల్లో పునాదులు వేశారని, వాటిని తొలగించి భూములను తమకు అప్పగిస్తే ఎప్పటిలాగానే వ్యవసాయం చేసుకుంటామని తెలిపారు. దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బాధిత రైతులు గేదెల నారాయణ, కుత్తుమ రామారావు, నేముల, తామాడ దేవరాజు, బొడ్డు ఈశ్వరమ్మ, కామాక్షమ్మ, లోకనాథం పాల్గొన్నారు.


ఆఫ్‌షోర్ పూర్తయ్యేనా?

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు ప్రారంభించి పుష్కర కాలమవుతున్నా ఇంకా పూర్తికావడం లేదు. ఇప్పటి వరకు కేవలం 45శాతం పనులే పూర్తయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శరవేగంగా జరిగిన ఈ పనులు వైసీపీ అధికారం చేపట్టిన తరువాత మందగించాయి. జగన్ సర్కారు నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్లలో కేవలం 7శాతం పనులే జరిగాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనుల పూర్తి చేస్తుందనే నమ్మకంతో ప్రజలు ఉన్నారు.

- రిజర్వాయర్ నిర్మాణంపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఐదేళ్లలో 7శాతం పనులే పూర్తి
- ప్రస్తుతం పెరిగిన అంచనా వ్యయం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

(టెక్కలి)

జలయజ్ఞంలో భాగంగా 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మెళియాపుట్టి, నందిగాం, పలాస మండలాల పరిధిలోని 24,600 ఎకరాలకు సాగునీటిని అందించాలనే లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం రూ.127కోట్ల అంచనా వ్యయంతో 2008 ఏప్రిల్ 4న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆఫ్‌షోర్ పనులకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో టెండర్లు దక్కించుకున్న హిందు, శ్రీవెంకటేశ్వర కనస్ట్రక్షన్ సంస్థలు పనులు ప్రారంభించాయి. అయితే నిధుల కేటాయింపు అరకొరగా ఉండడంతో కాంగ్రెస్ పాలనలో పది శాతం పనులే పూర్తయ్యాయి. 2014లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆఫ్‌షోర్ పనులపై దృష్టి పెట్టింది. అంచనా వ్యయాన్ని రూ.127కోట్ల నుంచి రూ.456 కోట్లకు పెంచింది. ఐదేళ్ల పాలనలో 28శాతం పనులు పూర్తయ్యాయి. అయితే, 2019 లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రివర్స్ టెండరింగ్ పేరిట రూ.288 కోట్లు టెండర్లకు పిలిచి సింగిల్ ఏజెన్సీకి అప్పగించింది. దీనివల్ల అప్పట్లో ప్రభుత్వానికి రూ.12కోట్ల నష్టం వాటిల్లింది. 2020-21 బడ్జెట్‌లో రూ.230కోట్లు, 2021-22 బడ్జెట్‌లో రూ.198కోట్లు కేటాయించినట్లు జగన్ సర్కారు ప్రకటించినా నిధులు మాత్రం విడుదల కాలేదు. ఆఫ్‌షోర్‌కు సంబంధించి రివైజ్డ్ ఎస్టిమేషన్‌తో పూర్తిచేస్తామని 2022 మే 5న అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. కానీ, పనులు మాత్రం చేపట్టలేదు. వైసీపీ తన ఐదేళ్ల పాలనలో కేవలం 7శాతం పనులే చేసింది. పైగా, ఈ పనులకు సంబంధించి రూ.20కోట్ల బిల్లులు కూడా చెల్లించలేదు. మరోపక్క వంశధార అధికారుల కూడా ఆఫ్‌షోర్ పనులపై నిర్లక్ష్యం వహించారనే విమర్శలు ఉన్నాయి. వంశధార ఎస్‌ఈతో పాటు 12మంది ఇంజనీరింగ్ అధికారులు ఉన్నా పనులు మాత్రం నత్తనడకన సాగాయి. ఎస్టిమేట్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కనస్ట్రక్షన్స్ పనులు కూడా పూర్తికాలేదు. ప్రస్తుతం ఆఫ్‌షోర్ అంచనా వ్యయం రూ.853.52 కోట్లకు చేరుకుంది. గత పుష్కరకాలంగా ప్రాజెక్టు కోసం రూ.344 కోట్లు ఖర్చుచేసినా పనులు పూర్తికాలేదు. మరో రూ.499కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.



'ఆఫ్‌షోర్'కు సంబంధించిన మదుము నిర్మాణ పనులు..

ఇంకా చేపట్టాల్సిన పనులు..

రేగులపాడు వద్ద రిజర్వాయర్ నిర్మాణం, అర్చనాపురం వద్ద కొండపై 600మీటర్ల అండర్ టర్నల్ తవ్వకం, మహేంద్రతనయ నదిపై చాపర వద్ద హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం, జాతీయ రహదారి సమీపంలో దేవుపురం, సుభద్రాపురం వద్ద రెండు అండర్‌పాసేజ్‌ల నిర్మాణం, అసంపూర్తి ల్యాండ్ ఎక్విజేషన్ ప్రక్రియతో పాటు ఆఫ్‌టెక్ స్లూయిస్‌లు, సూపర్‌పాసేజ్‌లు, వంతెనలు, రక్షణ గోడలు, టర్నల్స్, అండర్ టర్నల్స్, కుడి, ఎడమ కాలువల తవ్వకాలు వంటివి పూర్తిస్థాయిలో చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఆఫ్‌షోర్ పూర్తిపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు.. రిజర్వాయర్ పనులు పూర్తిచేస్తారనే నమ్మకంతో ఉన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేశాం

ఇప్పటివరకు ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు 45 శాతం జరిగాయి. కుడి, ఎడమ కాలువలు, రిజర్వాయర్ బండింగ్, డైవర్షన్ రోడ్డు వంటి పనులు కొంతమేరకు జరిగాయి. మిగిలిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- బి.శేఖరరావు, వంశధార ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

చేపల వేటకు వెళ్లి.. మత్స్యకారుడి మృతి



జంగమయ్య (ఫైల్)

ఎచ్చెర్ల/గార, సెప్టెంబరు 2: ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం గ్రామానికి చెందిన కొమర జంగమయ్య (53) చేపల వేటకు వెళ్లి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగమయ్య తమ గ్రామానికి అతి సమీపంలో ఉన్న సముద్రం, నాగావళి నది కలిసే ప్రాంతం(మగ)లో చేపల వేటకు వెళ్తుండేవాడు. ఇదే క్రమంలో శనివారం రాత్రి చేపలవేటకు ఒక్కడే తెప్పపై వెళ్లాడు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ వల్ల అలల తాకిడి ఎక్కువగా ఉండడం, నదిలో నీటి ప్రవాహం పెరగడంతో ప్రమాదానికి గురై గల్లంతయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం వరకు జంగమయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది తీరప్రాంతంలో వెతికారు. అయినా ఆచూకీ దొరకలేదు. సోమవారం గార మండలం బలరాంపురం వద్ద సముద్రతీరానికి జంగమయ్య మృతదేహం చేరుకుంది. గార పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జంగమయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళంలోని సర్వజనాసుపత్రి(రిమ్స్)కి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై గార పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. జంగమయ్య మృతితో భార్య నాగమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు, బంధువులు బోరున విలపించారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, బొంతలకోడూరు మాజీ సర్పంచ్ మాడుగుల వీరభద్రస్వామి పరామర్శించారు.

ఎక్సైజ్‌శాఖలోకి సెబ్

- విలీనానికి కూటమి ప్రభుత్వం నిర్ణయం
- వైసీపీ హయాంలో ఈ విభాగం నిర్వీర్యం
- నిధులు, అధికారాలకు కత్తెర



ఇచ్ఛాపురంలోని సెబ్ కార్యాలయం

(ఇచ్ఛాపురం/ మెళియాపుట్టి)

ఎక్సైజ్ శాఖకు పూర్వ వైభవం రానుంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) విభాగం.. ఎక్సైజ్ శాఖలో విలీనం కానుంది. వైసీపీ ప్రభుత్వం రహస్య అజెండాతో ఎక్సైజ్ శాఖను నిర్వీర్యం చేసింది. 70శాతం మంది సిబ్బందిని సెబ్‌కు బదలాయించింది. కానీ సెబ్‌లో కూడా ఈ ఐదేళ్లలో కొత్త నియామకాలు చేపట్టలేదు. పర్యవేక్షణకు బహుళ అధికారులను నియమించింది. ఎక్సైజ్ శాఖకు షాపుల పర్యవేక్షణ, కేసుల బాధ్యతను అప్పగించింది. మద్యం, సారా, ఇసుక, నిషేధిత వస్తువుల రవాణా నియంత్రణ బాధ్యతలు సెబ్‌కు అప్పగించింది. కానీ ఎటువంటి అధికారాలు కట్టబెట్టలేదు. కార్యాలయాలు, వాహన సదుపాయం కల్పించలేదు. దీంతో రెండు విభాగాల లక్ష్యాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ శాఖలో సెబ్‌ను విలీనం చేయాలని నిర్ణయించింది. ఈ అంశంపై 19మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో అక్కడ మద్యం విధానం లోటుపాట్లపై అధ్యయనం చేయాలని సూచించింది. ఈ మేరకు కమిటీ సభ్యులు నివేదిక కూడా అందజేశారు.

● నాలుగేళ్ల కిందట..

వైసీపీ ప్రభుత్వం 2020 మే 16న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేసింది. ఎక్సైజ్ శాఖలో పనిచేసిన సిబ్బందిని 30:70 నిష్పత్తిన విభజించి విధులు కేటాయించింది. జిల్లాలో మొత్తం 12 ఎక్సైజ్‌పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసింది. అయితే ఒక్క స్టేషన్‌కు కూడా సొంత భవనం లేదు. 15 మంది ఎస్‌ఐలకుగాను 10మంది మాత్రమే ఉన్నారు. హెచ్‌సీలు 186మందికిగాను 110మంది మాత్రమే కొనసాగుతున్నారు. కానిస్టేబుళ్లు సైతం అరకొరగానే ఉన్నారు. దీంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పెరుగుతోంది. నేర నియంత్రణ సాధ్యం కావడం లేదు. జిల్లాలో మొత్తం నమోదైన నేరాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోనివే అధికం. గత నాలుగేళ్లలో నేర నియంత్రణలో వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెబ్ పూర్తిగా విఫలమైంది.

● తగ్గిన సిబ్బంది

ఎక్సైజ్ శాఖ ఉమ్మడిగా ఉన్నప్పుడు ఒక్కో స్టేషన్‌లో 12 నుంచి 13 మంది కానిస్టేబుళ్లు ఉండేవారు. కానీ సెబ్‌కు సర్దుబాటు చేశాక ఇద్దరు, ముగ్గురు మాత్రమే మిగిలారు. వారే ఎస్కార్ట్ విధులకు, సెంట్రీ విధులకు వెళ్లాల్సి వచ్చింది. కొన్ని సందర్భాల్లో సిబ్బంది కొరతతో ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు సెంట్రీ విధులు నిర్వహించాల్సి వచ్చేది. ఎక్సైజ్ శాఖ పరిధిలో పనిచేసే ఇన్‌స్పెక్టర్‌కు 50 నుంచి 60 షాపులు నిర్వహించే బాధ్యత అప్పగించేవారు. దీనివల్ల నేర నియంత్రణ సాధ్యపడేది కాదు. గత ఐదేళ్లలో జిల్లాలో చాలా మద్యం షాపుల్లో నకిలీ మద్యం బయట పడింది. కొన్నిచోట్ల మద్యం దుకాణాల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించేవారు.

● అడ్డగోలుగా విభజన..

ఎక్సైజ్, సెబ్ మధ్య సహేతుకమైన విభజన జరగలేదు. గత ఐదేళ్లలో పదోన్నతులు, బదిలీలు అడ్డగోలుగా జరిగాయి. గతంలో ఎక్సైజ్ అధికారులకు ఉన్న అధికారాలన్నింటినీ తొలగించారు. అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకునేందుకు కూడా అవకాశం లేకుండా చేశారు. అలాగని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు సైతం అధికారాలు ఇవ్వలేదు. కొన్ని చట్టాల కింద కేసులు నమోదుచేసే అధికారాలు సెబ్‌కు లేకుండా చేశారు. బడ్జెట్ కేటాయింపులు కూడాక్రమేపీ తగ్గించారు.

● అరకొరగానే తనిఖీలు

ఎక్సైజ్ శాఖను సెబ్‌గా మార్చి.. గతంలో వైసీపీ నేతలు అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు కూడా నేతలకు కీలుబొమ్మగా మారారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఒడిశా నుంచి జిల్లాకు అధికంగా గంజాయి దిగుమతి జరిగినా.. సరిహద్దులో సెబ్ అధికారులు సక్రమంగా తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఒడిశా నుంచి మద్యం, సారా దిగుమతి కూడా యథేచ్ఛగా సాగుతోంది. ఈ నేపథ్యంలో మద్యం, సారా, గంజాయి, ఎర్రచందనం, ఇసుక, మట్టి, తదితర అక్రమ రవాణా అడ్డుకట్టకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తోంది.

నవ్య డాక్టర్

మంగళవారం • 3 సెప్టెంబరు 2024





కిడ్స్ డైట్

అమ్మ చేతి గోరుముద్ద!

పిల్లలు తినడానికి మొండికేస్తారు. అయిష్టత ప్రదర్శిస్తారు. బలవంతం చేస్తే ఏడ్చేస్తారు. అలాగని వదిలేస్తే పిల్లలకు పోషకాలు అందేదెలా? ఇలాంటప్పుడు పిల్లలకు బలవర్ధక ఆహారం మీద ఇష్టం పెరిగే చిట్కాలు పాటించాలి!

పిల్లల పోషకాహారం గురించిన అవగాహన తల్లుల్లో పెరగడం అభినందనీయమే! అయితే ఆ ఆహారంలో విటమిన్లు, ఖనిజలవణాలు, మాంసకృత్తులు, పిండిపదార్థాలు ఉండేలా సరి చూసుకోవడమూ అవసరమే! అయితే అవన్నీ ప్రాంతీయపరమైన, సంప్రదాయపూరితమైన, రుతుపరమైన ఆహార పదార్థాలేనా? మనం తినే ఆహారం, నివసించే వాతావరణాలతో మన అనుబంధం కాలక్రమేణా బలహీనపడుతోంది. ఇప్పటికి పదేళ్ల వెనక్కు వెళ్తే ఏ ఇంట్లో చూసినా పప్పు, అన్నంతో కూడిన భోజనమే తినేవాళ్లం. పిల్లలూ వాటినే ఇష్టంగా తినేవాళ్లు. కానీ ఇప్పుడు పోషకాల మీద పెరిగిన అవగాహన మూలంగా, పిండిపదార్థాలు, కొవ్వులను దూరం పెట్టేస్తున్నాం. ఏం కొంటున్నా, లేబుల్ పరీక్షించి, కేలరీలు లెక్కిస్తున్నాం. కానీ ఇలాంటి విపరీతమైన అప్రమత్తత వల్ల ఎక్కువ సందర్భాల్లో విలువైన పోషకాలకు దూరమవుతున్నాం. ఫిట్‌గా ఉండడానికి బదులు లావుగా తయారవుతున్నాం, తేలికగా జబ్బుల బారిన పడుతున్నాం. పోషకాలను బట్టి ఆహారాన్ని ఎంచుకునే ధోరణి వల్ల లాభపడేది ఆహార సంస్థలే! ప్రజల ఆరోగ్యానికి ఈ ధోరణి ఏమాత్రం ప్రయోజనకారి కాదు. కాబట్టి మరీ ముఖ్యంగా పిల్లలకు ఇచ్చే ఆహారం విషయంలో అమ్మమ్మల నాటి పాతవి, ఆరోగ్యకరమైన పద్ధతులనే ఎంచుకోవాలి.

అమ్మమ్మల ఆహారం!

ప్రపంచం మొత్తంలో స్థూలకాయం కలిగిన పిల్లలున్న దేశంగా భారతదేశం రెండవ స్థానంలో ఉంది. అంతమాత్రాన మనం పిల్లలు, వారి ఆహారపుటలవాట్లను అశ్రద్ధ చేస్తున్నామని కాదు. నిజానికి వారి ఆహారం పట్ల మనం అవసరానికి మించిన శ్రద్ధ ప్రదర్శిస్తున్నాం. పోషకాలున్న ఆహారం అది ప్రాంతీయమైనది కాకపోయినా, వెతికి వెతికి తినిపిస్తున్నాం. కానీ మన అమ్మలు, అమ్మమ్మలు ఇలా చేయలేదు. ఏ రుతువులో కాచే కాయలను ఆ రుతువుల్లో తినిపించారు. పొట్టు తీయని ధాన్యాలు, పెరట్లో పండిన కూరగాయలు, పళ్లు అందించారు. అప్పట్లో వంటగది ఇంటి మధ్యలో ఉండేది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వంటింట్లోకి వెళ్లి ఆహారం అందుకుని తినేటందుకే ఈ ఏర్పాటు. పాలు, పెరుగు, కమ్మని వెన్న, నెయ్యి జున్నులు ప్రతి ఇంట్లో తాజాగా, సిద్ధంగా ఉండేవి. సున్నుండలు, అరిసెలు లాంటి బలవర్థకైన చిరుతిళ్లు డబ్బాల్లో నింపి ఉంచేవారు. సెనగపప్పు ఉండలు, వేరుశనగ చెక్కలు, బెల్లం జిలేబీలు...ఇవన్నీ రక్తవృద్ధిని పెంచే చిరుతిళ్లే! వీటిలో ఎటువంటి ప్రిజర్వేటివ్స్, కృత్రిమ రంగులూ ఉండవు. కానీ ఇలాంటి వంటలు వండే బదులు, పాశ్చాత్య ఆహార పద్ధతులను అనుసరిస్తూ మాంసకృత్తుల కోసం సోయా, అవకాడొల మీద, పీచు కోసం ఓట్స్ మీద ఆధారపడుతున్నాం! వీటికంటే మెరుగైన ప్రత్యామ్నాయ, సంప్రదాయ పదార్థాలు ఎన్నో ఉన్నాయి.

పేచీ పెట్టే పిల్లలతో ఇలా...

కొంతమంది పిల్లలు తినడానికి పేచీ పెడతారు. ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయల పట్ల అయిష్టత ప్రదర్శిస్తారు. ఇలాంటప్పుడు పిల్లలకు ఆ ఆహారం పట్ల ఆసక్తి ఏర్పరిచే ప్రయత్నంచేయాలి. ఇందుకోసం పాలకూరను పెరట్లోనే పెంచాలి. పూల తొట్లలో కొత్తిమీర, పుదీనా, ఆకుకూరల విత్తనాలు చల్లి పిల్లల చేత వాటికి నీళ్లు పోయిస్తూ ఉండాలి. కూరగాయలు, ఆకుకూరలు ఎదిగే క్రమాన్ని పిల్లలు పరిశీలించేలా చేయాలి. అలాగే కూరగాయలు పండించే తోటలకు అరుదుగానైనా పిల్లలను తీసుకెళ్తూ ఉండాలి. పళ్లు, కూరగాయ మొక్కలను పిల్లలు గమనించేలా చేయాలి. ఇలా చేయడం వల్ల ఆ మొక్కల ఉత్పత్తుల పట్ల పిల్లలకు ఆసక్తి పెరుగుతుంది. వాటి వంటలను ఆస్వాదించాలనే కోరిక కూడా పెరుగుతుంది. ఆహారంతో అనుబంధం ఏర్పరచాలంటే పర్యావరణంతోనూ అనుబంధం ఏర్పరచాలి. పెద్దలు ఈ విషయంలో పిల్లలకు మార్గనిర్దేశకులుగా మారాలి. అలాగే బయట భోజనాలకు స్వస్తి చెప్పి, ఇంటి భోజనానికే పెద్దలు కట్టుబడి ఉండాలి. పిల్లలకూ ఆ అలవాటు నేర్పాలి. వంటింట్లో వంటపనిలో నిమగ్నమయ్యే తల్లులను చూసిన పిల్లలు కచ్చితంగా వంటగదిలో తయారయ్యే ఆహారాన్ని ఇష్టపడతారు. అలాగే కుటుంబసభ్యులందరూ నిర్దిష్ట సమయాల్లో కలిసి కూర్చుని భోజనం చేసే కట్టుబాటు అనుసరించాలి. ఆ సమయంలో టీవీ, సెల్‌ఫోన్ లాంటి వాటికి చోటు ఇవ్వకూడదు.

పోషకాల చిరుతిళ్లు ఇవే!

పిల్లలకు జంతికలు, గవ్వలు లాంటి నిల్వ పిండిపదార్థాలనే చిరుతిళ్లుగా ఇవ్వవలసిన అవసరం లేదు. పచ్చి కూరగాయ ముక్కలకు ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా జోడించి సలాడ్‌గా అందించవచ్చు. మొలకెత్తిన పెసలు, సెనగలు ఒక టీస్పూన్ నూనెలో వేయించి, క్రంచీగా ఉండడం కోసం వేయించిన వేరుసెనగ పప్పులు చల్లి, నిమ్మరసం కలిపి అందించవచ్చు. షియా విత్తనాలు నానబెట్టి, పండ్ల ముక్కలు, తేనె కలిపి తినిపించవచ్చు. కీర దోస లేదా జుకినిలను పొడవుగా తరిగి, ఉప్పు, చిల్లీఫ్లేక్స్, మొక్కజొన్న పిండి కలిపిన మిశ్రమంలో ముంచి, బ్రెడ్ పొడి అద్ది నూనెలో వేయించి అందించవచ్చు. కూరగాయలు కలిపి ఆమ్లెట్ వేసి ఇవ్వొచ్చు. పులిసిన పిండితో రొట్టెలు, చద్ది అన్నంతో దద్ధోజనం లాంటివి కూడా ఆరోగ్యకరమే! ఆవిరి మీద ఉడికించిన చికెన్, చేప ముక్కలు లేదా గ్రిల్ చేసినవీ పిల్లలకు అందించవచ్చు. పండ్లముక్కలతో కస్టర్డ్ తయారుచేసి పెట్టవచ్చు.

ఆకలి తెలియనివ్వాలి

సాధారణంగా భోజన వేళకు పిల్లలు కూడా కడుపు నిండా తినడం అన్నిసార్లూ వీలుపడకపోవచ్చు. అప్పుడప్పుడూ పిల్లల ఆకలి మందగిస్తూ ఉంటుంది. కాబట్టి తినడానికి పేచీ పెట్టినప్పుడు, బలవంతంగా తినిపించే ప్రయత్నం చేయకూడదు. ఆకలి ఉంటేనే పిల్లలకు ఆహారం అందించాలి. భయపెట్టి, బుజ్జగించి తినిపించడం వల్ల తల్లులు ఆశించే ప్రయోజనం నెరవేరకపోవచ్చు. సాధారణంగా తల్లులు, బడికెళ్లే ఈడు వరకూ పిల్లలకు ముద్దలు చేసి తినిపిస్తూ ఉంటారు. కానీ ఈ పద్ధతి కూడా సరికాదు. నడక వచ్చిన వయసు నుంచే పిల్లలు స్వతంత్రంగా తినే అలవాటు చేయాలి. ప్రతి రోజూ ఒకే సమయానికి, ఒకే ప్రదేశంలో తినే ఏర్పాట్లు ఉండాలి. పదార్థాలు నేల మీద పడిపోతాయనో, పిల్లలు చిందరవందర చేస్తారనో, దుస్తులు పాడైపోతాయనో పిల్లలను సొంతగా ఆహారం తిననివ్వకుండా అడ్డుకోకూడదు. పిల్లల కోసం ప్రత్యేకంగా తయారయ్యే స్పూన్లు, ఫోర్కులు, బౌల్స్, ప్లేట్స్‌నే వాడుకోవడం వల్ల వాటితో పిల్లలకు గాయాలు అవకుండా ఉంటాయి. నేల మీద పడినా పగిలిపోకుండా ఉండే పదార్థాలతో తయారైన పాత్రలు, స్పూన్లనే వాడుకోవాలి.

పిల్లల ఆహారం పసందుగా...

అన్నం, వేరుసెనగపప్పు, నెయ్యి, ఒక పండు, ఇంట్లో తయారైన లడ్డు.. ఇదీ పిల్లలకు అనునిత్యం ఇవ్వవలసిన ఆహారం. వీటితోపాటు కూరగాయలు, ఇంట్లో వండిన ఎటువంటి ఆహారమైనా ఇవ్వవచ్చు. చిరుతిళ్లుగా గుప్పెడు వేరుసెనగపప్పులు, తాజా పండ్లు, అటుకుల ఉప్మా, గోధుమరొట్టె, బెల్లం ముక్క, ఇంట్లో తయారైన సున్నుండలు, లడ్లు... ఇలా పోషకభరితమైన చిరుతిళ్లను పిల్లలకు అలవాటు చేయాలి. 'ఫలానా పాఠం తప్పు లేకుండా రాసి చూపిస్తే, చాక్లెట్లు ఇప్పిస్తా!' లాంటి ఆశ పెట్టే పద్ధతులు మానేయాలి. చాక్లెట్లను వారానికి ఒకసారికే పరిమితం చేయాలి. గోధుమ బియ్యంలో పోషకాలు అధికం. అలాగని వాటిని వండి పెడితే పిల్లలు తినడానికి ఇష్టపడరు. కాబట్టి బియ్యంతోపాటు రెండు గరిటెల గోధుమ బియ్యం కలిపి వండి పెట్టవచ్చు. క్యారట్, క్యాప్సికమ్ లాంటి కూరగాయలను అందమైన ఆకారాల్లో కోసి, ఆకర్షణీయమైన అలంకరణతో వడ్డించి, పిల్లల్లో ఆసక్తినీ రేకెత్తించవచ్చు. వీలైనంత వరకూ భిన్నమైన పోషకాలు అందేలా మూడు, నాలుగు కూరగాయలను కలిపి వండవచ్చు. ఇలా పిల్లలకు నచ్చే, వారు మెచ్చే తరహాలోనే ఆహారం పట్ల వారికి ఇష్టాన్ని రెట్టింపు చేయవచ్చు.



బ్లడ్ గ్రూప్ డైట్

కార్బ్స్ కావలసిందే!

కార్బ్స్‌ను పూర్తిగా దూరం పెట్టేసే డైట్ ట్రెండ్‌ను విస్తృతంగా అనుసరించేవాళ్లున్నారు. కానీ శక్తిని సమకూర్చే పిండిపదార్థాలను పూర్తిగా మానేస్తే శరీరానికి శక్తి సమకూరేదెలా? మంచి, చెడు పిండిపదార్థాల్లో వేటిని ఏ పరిమాణంలో తీసుకోవాలో అవగాహన ఏర్పరుచుకుని తదనుగుణంగా మసలుకోవాలి.

పిండిపదార్థాలు ప్రధాన పోషకాలు. మనం రోజూ తీసుకునే ఆహారంలో 70% పిండిపదార్థాలే ఉంటాయి. జీర్ణవ్యవస్థ పిండిపదార్థాలను గ్లూకోజ్‌గా మారుస్తుంది. శరీరం ఈ గ్లూకోజ్‌ను కణజాలం, కణాలు, అవయవాల శక్తి కోసం వినియోగిస్తుంది. కాబట్టి శక్తినిచ్చే పిండిపదార్థాలు పూర్తిగా మానేయడం అవివేకం.


పిండిపదార్థాలు లోపిస్తే?

శక్తికి మూలాలైన పిండిపదార్థాలు లోపిస్తే శరీరం పలు లక్షణాల రూపంలో ఆ లోపాన్ని బహిర్గతపరిచే ప్రయత్నం చేస్తుంది. అవేంటంటే...

- నీరసం
- నోటి దుర్వాసన
- మలబద్ధకం
- వాంతులు
- తలనొప్పి
- పోషకలోపం

డి - గ్లూకోజ్

అత్యంత ముఖ్యమైన, కీలకమైన పిండిపదార్థం గ్లూకోజ్. అన్ని జీవరాశులు శక్తి కోసం వాడుకునే సులువైన చక్కెర (మోనోశాఖరైడ్) ఇది. అయితే పిండిపదార్థాలు శరీర బరువును కచ్చితంగా పెంచుతాయి. అవసరం లేని చెడు పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ, అవసరం ఉన్న మంచి పిండిపదార్థాలను పరిమితంగా తీసుకునేవారికి ఈ సమస్య సహజం. కాబట్టి వాటిలో ఏవి మంచి, ఏవి చెడు? అనే విషయం మీద అవగాహన ఏర్పరుచుకోవాలి.



మంచి పిండిపదార్థాలు (కాంప్లెక్స్ కార్బ్స్)

వీటిలోని రసాయన రూపం, పీచులను జీర్ణం చేసుకోవడానికి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చుచేయవలసివస్తుంది. వీటి నుంచి అందే శక్తి శరీరానికి ఎక్కువ సమయంపాటు ఉపయోగపడుతుంది. మంచి పిండిపదార్థాలలో...

- పోషకాలు, పీచు ఎక్కువ
- గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ
- తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండుతుంది
- శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం (మెటబాలిజం) పెరుగుతుంది.

పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్, రొట్టెలు, తృణధాన్యాలు, ఆకుపచ్చని కూరగాయలు, చిలకడదుంపలు, తాజా పళ్లు ఈ కోవకు చెందినవి.

చెడు పిండిపదార్థాలు (సింపుల్ కార్బొహైడ్రేట్స్)

ఇవన్నీ పొట్టు తీసి, పాలిష్ చేసిన పదార్థాలు. వీటిలో సహజసిద్ధ పోషకాలు, పీచు తక్కువ. చెడు పిండిపదార్థాల్లో...

- పీచు, పోషకాలు అతి స్వల్పం
- గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ
- క్యాలరీలు కొవ్వుగా మారతాయి
- అత్యధిక గ్లూకోజ్ స్థాయిలు (నీరసం తెప్పిస్తాయి)

చాక్లెట్లు, తీపి పదార్థాలు, తీపి జోడించిన తృణధాన్యాలు, సోడాలు, శీతల పానీయాలు, పొట్టు తీసిన పిండ్లు ఈ కోవకు చెందినవి.

మేలురకం పిండిపదార్థాలు వీటిలో...

ఓట్స్‌తో తయారైన బిస్కెట్లు, నారింజ రసం, యాపిల్, కేరట్లు, టమేటాలు, ఎండుద్రాక్ష, ద్రాక్ష, అరటిపళ్లు.

- **ఓట్‌మీల్:** ఎక్కువ సమయంపాటు శక్తినిచ్చే నిలకడైన పిండిపదార్థం ఇది. నీళ్లు కలిపి తయారుచేసిన ఒక కప్పు ఓట్‌మీల్‌లో 159 క్యాలరీలు ఉంటాయి. 4 గ్రాములు పీచు, 6 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **యాపిల్:** భోజనానికి, భోజనానికి మధ్య తీసుకోవలసిన ఈ అల్పాహార ఫలంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే 4 గ్రాముల పీచు, పెక్టిన్‌లు ఉంటాయి. మాంసకృత్తులు పుష్కలంగా ఉండే వేరుసెనగపప్పుతో తయారయ్యే వెన్నతో కలిపి తీసుకుంటే ప్రయోజనకరం.
- **చిలకడదుంపలు:** ఇది నిజమైన 'సూపర్ ఫుడ్'. కప్పు చిలకడదుంప ముక్కల్లో 7 గ్రాముల పీచు, అత్యధిక విటమిన్ ఎ, సిలు, 4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **మినుములు:** ఒక కప్పు ఉడకబెట్టిన పొట్టు తీయని మినుముల్లో 15 గ్రాముల పీచు, అంతే పరిమాణంలో మాంసకృత్తులు ఉంటాయి. ఇంత పరిమాణంలో పోషకాలు మరే పదార్థంలోనూ ఉండవు.
- **టమేటాలు:** వీటిలో విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలం. పీచుతో పాటు లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంటు కూడా వీటిలో ఉంటాయి.

గ్యాస్ వేధిస్తుంటే..

వేళకు తినకపోవడం, తిన్నా అరగకపోవడం చాలా మందికి ఎదురయ్యే సమస్య. వేపుళ్లు, జంక్ ఫుడ్, అధిక నూనెతో వండిన వంటకాలను తినటం వల్ల గ్యాస్ పెరిగి కడుపుబ్బరం సమస్య ఏర్పడుతుంది. దీనికి చిన్న చిట్కాలతో పరిష్కారం లభిస్తుంది. అవేమిటో చూద్దాం..

సమస్య మూలమిది: మనం తిన్న ఆహారం కడుపులోకి వెళ్లిన తరువాత.. జీర్ణం అవుతుంది. ఆ జీర్ణప్రక్రియలో కొన్ని రకాల వాయువులు విడుదలవుతాయి. కొన్ని సార్లు. అవి బయటికి వెళ్లకుండా కడుపులోను, పేవులలోను పేరుకుపోతాయి. అవి చెడువాయువులుగా మారి ఇబ్బంది పెడతాయి. ఆయుర్వేదంలో ఈ సమస్యను అర్భానం, ఆటోపం అంటారు. ఈ వాయువులు బయటకు వెళ్లకపోతే ఆ ప్రభావం గుండె.. ఊపిరితిత్తులపై పడుతుంది. గుండె దడ, ఆందోళన, గుండెల్లో నెప్పి మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ప్రతి రోజు క్రమం తప్పకుండా పల్చటి మజ్జిగ తాగితే ఈ సమస్య చాలా వరకూ పరిష్కారమవుతుంది.

చిట్కాలివే: అరిటి బోద లోపల తెల్లటి పదార్థం ఉంటుంది. దీని రసాన్ని రోజుకు ఒక కప్పు చొప్పున 15



రోజులు తాగితే గ్యాస్ సమస్య తగ్గిపోతుంది.

- అల్లం రసం తీసి దానిని వేడిచేసి తగినంత బెల్లం కలపాలి. ఇలా కలిపిన మిశ్రమాన్ని రోజుకు ఒక స్పూను తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కడుపుబ్బరం తగ్గిపోతుంది.
- గింజలున్న ఎండిన నల్ల ద్రాక్షను తీసుకొని నీళ్లలో ఆరు గంటలు నానబెట్టాలి. ఇలా నానిన ద్రాక్ష రసాన్ని తాగితే గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- శొంఠిపొడి, పాత బెల్లంపొడిలను సమ పాళ్లలో కలుపుకోవాలి. ప్రతి రోజూ ఉదయం ఈ మిశ్రమాన్ని ఒక స్పూను తినాలి. ఆ తర్వాత వేడి నీళ్లు తాగాలి. ఇలా తాగితే కడుపులో ఉన్న మలినాలన్నీ తొలగిపోతాయి.
- ధనియాలు, శొంఠిలను సమపాళ్లలో తీసుకొని.. వేడి నీటిలో మరిగించాలి. అలా తయారయిన కషాయాన్ని తాగి నడిస్తే- గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- సోంపు, జీలకర్ర, వాములను సమపాళ్లలో తీసుకొని పొడి చేయాలి. ఈ పొడిని ఉదయం, సాయంత్రం ఒక స్పూను చొప్పున వేడి నీళ్లలో వేసుకొని తాగాలి. ఇలా తాగితే వారం రోజుల్లో గ్యాస్ సమస్య తొలగిపోతుంది.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. కేక్‌లు కట్ చేయడంతో పాటు రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు: ఎమ్మెల్యే ఎన్ఈఆర్

లావేరు: రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడవచ్చని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా కొత్తకుంకాం గ్రామంలో జనసేన, టీడీపీ, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. సుమారు 30 మంది రక్తదానం చేయగా వారిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం 'గ్రీన్‌ఆంధ్ర-క్లీన్ ఆంధ్ర'లో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ విష్వక్సేన్ కొత్త కుంకాం జనసేన నాయకులు ఇజ్జి సంతోష్ కుమార్, సంతోష్, బీజేపీ నాయకుడు దేవిరెడ్డి వీరబాబు, టీడీపీ నాయకులు పల్లంట్ల చిట్టిబాబు, వండాన సత్యం తదితరులు పాల్గొన్నారు.● **జి.సిగడాం:** గేదెలపేట, జి.సిగడాం బీసీ బాలుర వసతి గృహం, ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ మొక్కలు నాటారు. క్యాన్సర్‌తో బాధ పడుతున్న గేదెలపేటకి చెందిన వైశ్యరాజుల రాజు కుటుంబానికి ఎమ్మెల్యే ఎన్ఈఆర్, జనసేనపార్టీ ఇన్‌చార్జి విష్వక్సేన్ రూ.25 వేలు సాయం అందించారు. జి.సిగడాంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ● **రణస్థలం:** రామతీర్థం జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలోనూ ఎన్ఈఆర్, విష్వక్సేన్ పాల్గొని కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

● **ఇచ్ఛాపురం:** పట్టణంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరు, పదో వార్డులో జనసేన జెండా స్థూపాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన అధికార ప్రతినిధి పి.వివేక్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి తిప్పన దుర్యోధనరెడ్డి, ప్రధాన కార్యదర్శులు బైపల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.


లావేరు: పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జనసేన ఇన్‌చార్జి డా.విష్వక్సేన్

● **కవిటి:** రక్తం దానం చేయడం ఎంత అవసరమో పేదలకు అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండటం అంతే ముఖ్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా జగతిలో జనసేన నాయకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ డీఎస్పీ ఎస్.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఉద్దానం బ్లడ్ సెంటర్ సిబ్బంది 50 మంది నుంచి రక్తాన్ని సేకరించారు.

● **బూర్జ:** మండలంలోని కొల్లివలసలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగేంద్ర, కె.మల్లేశ్వరరావు, జయరాం, రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

● **నరసన్నపేట/జలుమూరు:** నరసన్నపేట మండలం యారబాడు గ్రామ సచివాలయం వద్ద సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బలగ ప్రవీణ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంతోనే గ్రామస్వరాజ్యం సిద్ధిస్తుందన్నారు. అలాగే శ్రీముఖలింగంలో పవన్ కల్యాణ్ పేరుమీద అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు యోగ హరి, తాడేల సత్య, కూర్మారావు పాల్గొన్నారు.


కవిటి: జగతి రక్తదానం చేస్తున్న దాతలను అభినందిస్తున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్

● **టెక్కలి:** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం టెక్కలి జనసేన కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రావివలసలో పలువురు వైసీపీ కార్యకర్తలు కిరణ్‌కుమార్, అన పాన జనార్దన రెడ్డి ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. కార్యక్రమంలో జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా బైపల్లి, పెద్ద మురహరిపురంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలాస జనసేన సమన్వయకర్త వి.దుర్గారావు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు పవన్ కల్యాణ్ సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొరకల వసంతస్వామి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

● **మెళియాపుట్టి:** మండలంలో పలు గ్రామాల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు పలు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు. మొక్కలను నాటారు. జనసేన ఇన్‌చార్జి గేదెల చైతన్య, బీజేపీ నాయకుడు శరత్‌కుమార్, దుక్క బాలరాజు, తిరినగరి ప్రసాదరావు, టీడీపీ నాయకులు అనపాన రాజశేఖరెడ్డి, వై.రాజమోహన్ పాల్గొన్నారు.


బూర్జ: కొల్లివలసలో రక్తదాతలను అభినందిస్తున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్


ఇచ్ఛాపురం: మొక్క నాటుతున్న దాసరి రాజు


మెళియాపుట్టి: చీపురుపల్లిలో కేక్ కట్ చేస్తున్న గేదెల చైతన్య


వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురంలో మొక్కలను అందిస్తున్న టీడీపీ, జనసేన పార్టీ నాయకులు


టెక్కలి: జనసేన కార్యాలయంలో రక్తదాతను అభినందిస్తున్న కణితి కిరణ్‌కుమార్ తదితరులు


నరసన్నపేట: యారబాడులో మొక్క నాటుతున్న జనసేన ఇన్‌చార్జి బలగ ప్రవీణ్


కాశీబుగ్గ సంతమైదానంలో..


పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు క్యాంపు కార్యాలయంలో..

ముగ్గురు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

టెక్కలి: జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. టెక్కలి తహసీల్దార్ సాదు దిలీప్ చక్రవర్తి, ఎచ్చెర్ల తహసీల్దార్ ఎ.సింహాచలం, కొవ్వాడ భూ సేకరణ విభాగం తహసీల్దార్ పప్పల వేణుగోపాల్‌కు పదోన్నతి కల్పిస్తూ జీవోఎంఎస్ నెం.175ను ఆగస్టు 31న స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది తహసీ ల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభించగా, వారిలో జిల్లాకు చెందిన వారు ముగ్గురున్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి

నరసన్నపేట/కాశీబుగ్గ: పెరిగిన నిత్యావసర ధరలను నియంత్రించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు పెరిగిన ధరలపై చేపడుతున్న ఉద్యమ పోస్టర్లను సోమవారం నరసన్నపేట, కాశీబుగ్గల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చాపర సుందర్‌లాల్, వెంకట్రావు, వేణు గోపాల్, కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, తక్షణం నిత్యావసరాలు, కూరగాయలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరసన కార్యక్రమాలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలివ్వాలి

పలాస: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలివ్వాలని ఏఐసీటీయూసీ డివిజన్ ప్రధాన కార్యదర్శి చాపర వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు మీటర్ రీడర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.ఓంకారరావు, డి.భాస్కరరావు తదితరులతో కలిసి ఈఈ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4,500 మంది మీటర్ రీడర్లు సంస్థను నమ్ముకొని 20 ఏళ్లుగా సేవలందిస్తున్నారన్నారు. వీరికి వేతనాలు సకాలంలో చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. డీఈఈకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు జి.ఆనందరావు, కె.నరేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు దారి చూపండి

మెళియాపుట్టి: అంపురం నుంచి గొడ్డ గ్రామం వెళ్లే మార్గంలో రహదారిపై వరినాట్లు వేసి ఎనిమిది గిరిజన గ్రామాలకు దారి లేకుండా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గడచిన మూడేళ్లుగా ప్రతి ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతోందని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు. రహదారిలో కొంత మేర జిరాయితీ స్థలం ఉందనే నెపంతో దమ్ములు చేసి నాట్లు వేయడం వల్ల దారిలేకుండా పోతోందని వాపోయారు. ప్రస్తుతం వర్షా లు పడుతున్నందున గ్రామాల్లో గిరిజనులు విషజ్వరాలతో బాధపడుతున్నారని, సరైన రోడ్డు లేకపోవడంతో వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ హనుమంతరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమం లో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, ఇలాయిపురం సర్పంచ్ గవిరేష్, గిరిజన సంఘ నేతలు అప్పన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పైరుకు బూస్టర్ డోస్ ఎరువులు వేయాలి

జలుమూరు: ప్రస్తుత వర్షాల వల్ల వరి పైరు దుబ్బు దశలో ఉన్నందున నీట మునిగిన పొలాల్లో బూస్టర్ డోసు ఎరువులు వేయాలని రాగోలు వ్యవసాయ శాస్త్రవేత్తలు పి.ఉదయబాబు, భాగ్యలక్ష్మి అన్నారు. పాగోడు తదితర గ్రామాల్లో భారీ వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలిచ్చారు. నీట మునిగిన వరి పొలాల్లో ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ బూస్టర్ డోస్ వేయాలన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట ఏడీఏ కె.రవీంద్రభారతి, ఏవో కె.సురేష్, వ్యవసాయ సహాయకులు అశోక్‌కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి రచ్చ రచ్చ

● దేహశుద్ధి చేసిన వీరభద్రాపురం గ్రామస్థులు

పలాసరూరల్: వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి సచివాలయం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న హుస్సేన్ పూటుగా మద్యం సేవించి పలాస మండలం వీరభద్రాపురంలో రచ్చ చేయగా స్థానికులు ఆయనకు దేహశుద్ధి చేసిన ఘటన వీడియో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సదరు కార్యదర్శి హుస్సేన్ వీరభద్రాపురం గ్రామానికి వచ్చి స్థానిక మహిళతో అసభ్యంగా వెకిలి చేష్టలు వేయడంతో గ్రామస్థులు అతడిని నిలదీశారు. బాధ్యత కలిగిన అధికారి ఇలా ప్రవర్తించడంపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినా సదరు వ్యక్తి దురుసుగా వ్యవహరించడంతో దేహ శుద్ధి చేశారు. చివరకు క్షమించమని గ్రామస్థులను ఆయన కోరడంతో విడిచిపెట్టారు. మద్యం మత్తులో వెకిలి చేష్టలు వేసిన ఈ వీడియో గ్రామస్థులు తీయగా సోషల్ మీడియాలో వైరల్ అయింది. గ్రామస్థులు ఈ విషయంపై వజ్రపుకొత్తూరు ఎంపీడీవో ఈశ్వరమ్మకు సమాచారమివ్వగా ఆమె ఘటనపై ఆరా తీశారు. దీనిపై ఆమెను వివరణ కోరగా సదరు ఉద్యోగి ప్రవర్తనపై ఫిర్యాదు వచ్చిందని, వెంటనే మెమో అందించామన్నారు. దర్యాప్తు చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.


ఉద్యోగిని ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

జీజీహెచ్‌లో బాధితుడికి పింఛన్ అందజేత

పలాస: శ్రీకాకుళం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పలాస సీతారామ్‌నగర్‌కు చెందిన పాతాళ లచ్చయ్య కు సోమవారం పురుషోత్తపురం వీఆర్వో షేక్ జుబేర్ నెలవారీ పింఛన్‌ను అందించారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న వీఆర్వో శ్రీకాకుళం వెళ్లి పింఛన్ అందించారు. ఈ సందర్భంగా వీఆర్వోను కమిషనర్ నాగేంద్రకుమార్, తహసీల్దార్ అభినందించారు.

సింగుపురం గ్రామానికి చెందిన ఇద్దరికి..

నందిగాం: బెజ్జిపల్లి పంచాయతీ సింగుపురం గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ఆసుపత్రులకు వెళ్లి సిబ్బంది సోమవారం పింఛన్ అందజేశారు. బెజ్జిపల్లి సచివాలయ సిబ్బంది శ్రీకాకుళం సర్వజన ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న పోలా నారాయణమ్మ, టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగరాపు కనవయ్యలకు పింఛన్ అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాడి సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై రాజకీయం చేయడం తగదు

● మాజీ మంత్రి సీదిరికి టీడీపీ నేతల హెచ్చరిక

పలాస/హరిపురం/వజ్రపుకొత్తూరు: ప్రకృతి వైపరీత్యాలపై మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుద్ధిలేని వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది ఎంతమాత్రం తగదని టీడీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం పలాస, హరిపురం, వజ్రపుకొత్తూరు మండలాల్లో టీడీపీ నేతలు వజ్జ బాబూరావు, దాసరి తాతారావు, కర్ని రమణ తదితరులు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి పదవి పోయిన తరువాత ఉనికి చాటుకునేందుకు అప్పలరాజు మా పార్టీ నేతలపై బురదజల్లుతున్నారన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారులు పర్యటిస్తూ బాధితులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని కూడా మాజీ మంత్రి విమర్శించడం దురదృష్టకర మన్నారు. బురద రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. చంద్రబాబును తిడితే జగన్ దృష్టిలో పడతామనే తాప త్రయంతో అప్పలరాజు ఈ విమర్శలు చేస్తున్నారని, గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమాలు, ఆక్రమణలే తప్ప అభివృద్ధి చేయలేదని, టీడీపీ కార్యకర్తలతో పాటు నేతలు గౌతు శిరీష, అచ్చెన్నాయుడు తదితరులపై తప్పుడు కేసులు బనాయించడం తప్ప ఏమీ చేయలేదని దుయ్యబట్టారు. పొరుగు రాష్ట్రం ఒడిశాలో వరదలు వస్తే చంద్రబాబు సాయంచేశారని, తితలీ తుఫాన్ సమయంలో ఆయన క్షేత్రస్థాయిలోనే ఉండి ప్రజలను ఆదుకున్న విషయం ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. ఇప్పటికైనా మా నాయకులను దూషించడం మానుకోవాలని, లేకుంటే తగిన రీతిలో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో టీడీపీ నేతలు లొడగల కామేశ్వరరావుయాదవ్, దువ్వాడ శ్రీకాంత్, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, పుచ్చ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




పలాస, హరిపురంలలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

టీడీపీ అధినేతపై విమర్శలు మానుకో..

● మాజీమంత్రి సీదిరిని హెచ్చరించిన ఎమ్మెల్యే శిరీష



పలాస: వరద ప్రభావిత ప్రాంతాల్లో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు పర్యటించి బాధితులను ఆదుకుంటుంటే మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శలు చేస్తున్నారని, ఇది ఎంత మాత్రం సమంజసం కాదని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు సోమవారం సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. బాధితులను ఆదుకునేందుకు చంద్రబాబు స్పందిస్తున్న తీరును ప్రపంచవ్యాప్తంగా ప్రశంసి స్తుంటే అప్పలరాజు మాత్రం ఆయనను టార్గెట్‌గా చేసి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. తితలీ తుఫాన్ సమ యంలో చంద్రబాబునాయుడు వారం రోజుల పాటు పలాసలో బస్సులోనే ఉండి బాధితులను ఆదుకోవడంతో పాటు పరిస్థితిని చక్కదిద్దిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. విజయవాడకు వచ్చిన వరదల్లో కేంద్రంతో మాట్లాడి అదనంగా ఎన్‌డీఆర్ఎఫ్ దళాలను రప్పించి నేరుగా ప్రజలకు భరోసా ఇచ్చారన్నారు. వైసీపీ హయాంలో నెల్లూరులో వచ్చిన వరదలకు హెలీకాప్టర్‌లో అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి వెర్రి నవ్వులు నవ్వుతూ చక్కర్లు కొట్టిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. ఇప్పటికైనా నోటిని అదుపులో పెట్టుకోవాలని లేకుంటే ఫలితం వేరే విధంగా ఉంటుందని అప్పలరాజును హెచ్చరించారు.

విద్యుత్ శాఖకు షాక్

● మిల్లు యజమానికి రూ.8 లక్షలు చెల్లించండి
● పాత బకాయిలకు 12 శాతం కలిపి ఇవ్వాలి
● సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఆదేశాలు
● పుష్కరకాలం తరువాత బాధితుడికి న్యాయం

టెక్కలి: విద్యుత్ శాఖ ద్వారా తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు న్యాయ పోరాటంతో పాటు సీజీఆర్ఎఫ్‌ను ఆశ్రయించడంతో వాదోపవాదాలు తరువాత బాధితుడికి రూ.8 లక్షలు చెల్లించాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ పి.సత్యనారాయణ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. 2008-2011 మధ్య తన మిల్లుకు సంబంధించి విద్యుత్ చార్జీలు అధిక మొత్తంలో ట్రాన్స్‌కో అధికారులు వసూలు చేశారని టెక్కలి మేజర్‌పంచాయతీ తొలుసూరుపల్లి రోడ్డులోని భాగ్యలక్ష్మి మోడ్రన్ రైస్‌మిల్లు యజమాని బొంగు బైరాగి ట్రాన్స్‌కో ఉన్నతాధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు పరిశీలించిన అధికారులు మిల్లువద్ద ట్రాన్స్ ఫార్మర్ ఫెయిలైందని గుర్తించి అప్పటి వరకు వసూలు చేసిన బిల్లును రివిజన్ కోసం అప్పటి ఏఈ, ఏడీఈలకు ఆదేశించారు. ఈ మేరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయితే అప్పటి వరకు చెల్లించిన మొత్తాన్ని ఆ తరువాత సర్దుబాటు (అడ్జస్ట్) చేయాలని బైరాగి కోరాడు. మిల్లు యజమానే రూ.5.51 లక్షలు విద్యుత్ బకాయిలున్నాడని పేర్కొంటూ కనెక్షన్‌ను తొలగించారు. దీంతో విద్యుత్ అధికారుల నిర్వాకంపై బాధితుడు హైకోర్టును ఆశ్రయించాడు. పుష్కర కాలం పాటు బాధితుడు, ట్రాన్స్‌కో అధికారుల మధ్య హైకోర్టులో వ్యాజ్యాలు నడిచాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు డివిజన్ బెంచ్ బాధితుడు బైరాగికి, ట్రాన్స్‌కోకు మధ్య రూ.1.36 లక్షలు మాత్రమే వ్యత్యాసం ఉందని గుర్తించి ఎవరు బకాయి ఉన్నా పరిష్కారానికి కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) ఉత్తమమైన మార్గమని నిర్దేశించింది. దీంతో బాధితుడి తరఫున సహచట్టం కార్యకర్త కొంక్యాన శ్రీరామ్ కిషోర్ ఈ ఏడాది మే 16న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్)కు ఫిర్యాదు చేశారు.

ఈ నేపథ్యంలో ఈ సమస్యపై విశాఖలో వేదిక ఆధ్వర్యంలో ఐదు పర్యాయాలు వాదనలు జరగ్గా ఇరువర్గాలు కమిటీ ఎదుట తమ వాదనలు వినిపించాయి. చివరికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ పి.సత్యనారాయణ, సభ్యులు జనార్దనరావు, శ్రీనివాసరావులు.. శ్రీరామ్ కిషోర్ వాదనలతో ఏకీభవించి బాధితుడికి నష్టపరిహారం కింద రూ.6 లక్షలు, మానసిక ఒత్తిడి కింద రూ.2 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. అలాగే 2008-2011 మధ్యకాలంలో బైరాగి వద్ద వసూలు చేసిన అధిక మొత్తం చార్జీలకు 12 శాతం చక్రవడ్డీతో కలిపి ఈ ఏడాది అక్టోబరు ఒకటిలోగా చెల్లించాలని ట్రాన్స్‌కో అధికారులకు గత నెల 29న ఆదేశించారని శ్రీరామ్‌కిషోర్ తెలిపారు. సీజీఆర్ఎఫ్‌కు తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసిన ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ తమ్మినాన ఈశ్వరరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఈ కేసు వ్యవహారమై సీజీఆర్ఎఫ్ బైరాగికి రూ.8 లక్షలు చెల్లించాలని ఆదేశాలిచ్చిందన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట: ప్రతి ఇంటిలో, కార్యాలయ ఆవరణల్లో మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. వన మహోత్సవంలో భాగంగా సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నా టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల పెంపకం ద్వారా వాతావరణ సమతుల్యత సాధ్యపడుతుందన్నారు. పెనుగాలులు, తుఫాన్‌ల నుంచి రక్షణ కల్పించడంలో మొక్కలు సహాయ పడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, టీడీపీ నేతలు శిమ్మ చంద్రశేఖర్, చిట్టిబాబు, కింజరాపు రామారావు, బోయన ఆనంద్, రోణంకి కృష్ణంనాయుడు, జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు ● టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రజా సదన్‌లో సోమవారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేసిన టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బైరి భాస్కరరావు, ఎంవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పెట్రోల్ బంక్ తనిఖీ

హరిపురం: మండలంలోని ఓ పెట్రోల్ బంక్‌లో కల్తీ డీజిల్ విక్రయంపై ఆటో యజమానులు ఆందోళన చేసిన నేపథ్యంలో సదరు బంక్‌ను డీటీ శనాపతి రవి, వీఆర్వో రామచంద్రరావు సోమవారం తనిఖీ చేశారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'కల్తీ డీజిల్ అమ్మకాలపై ఆం దోళన' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శాంపిల్స్ సేకరించి నివేదకను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు.

గోపాలపెంటలో వైద్యశిబిరం

నరసన్నపేట: గోపాలపెంట గ్రామంలో విషజ్వరాలు విజృంభించడంతో మాకివలస పీహెచ్‌సీ వైద్యులు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ జె.విజయ్‌కుమార్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.● **టెక్కలి:** బూరగాంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల గ్రామంలో విషజ్వరాలు ప్రబలిన నేపథ్యంలో స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. 77 మందికి మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్ పరీక్షలకు రక్తనమూనాలు సేకరించారు. వైద్యాధికారి పవన్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గోతులు పూడ్చివేత

హిరమండలం: హిరమండలం బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతలను సోమవారం పూడ్చివేశారు. రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి వర్షాలకు దారుణంగా తయారవడంతో క్రషర్ బుగ్గిని వేసి తాత్కాలికంగా పూడ్చారు. ఈ ప్రక్రియను పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్ తనయుడు సాయి గణేష్ తదితరులు పరిశీలించారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత అవసరం

నరసన్నపేట: సమాజంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత అవసరమని, ఇది ఎల్ఐసీతో సాధ్యమని డీటీ పి.శ్రీనివాసరావుఅన్నారు. సోమవారం ఎల్ఐసీ కార్యాలయంలో 68వ బీమా వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ నేతాజీ మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి పాలసీలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

మూఢ విశ్వాసాలను విడనాడాలి

నరసన్నపేట: సమాజంలో ఉన్న మూఢ విశ్వాసాలను విడనాడాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. సోమవారం జనవిజ్ఞాన వేదిక ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. అ శాస్త్రీయ భావనలు, మూఢ నమ్మకాలు పెరుగుతున్న తరుణంలో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్.సురేష్‌బాబు, పి.సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. సాగుకు నీరందక

- మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇదీ సరాళి ఎత్తిపోతల పథకం పరిస్థితి

పాతపట్నం: సరాళి ఎత్తిపోతల పథకం నిర్వహణకు నోచుకోకపోవడంతో ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. వైసీపీ హయాంలో ఈ పథకం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా ఈ పథకం మరమ్మతులకు నోచుకొని ఆయకట్టుకు నీరందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


శిథిలావస్థకు చేరిన సరాళి ఎత్తిపోతల పథకం

ఇదీ పరిస్థితి..

మండలంలోని సరాళి సమీపంలో మహేంద్రతనయ నదిపై 1975లో ఎత్తిపోతలపథకాన్ని నిర్మించారు. తొలుత ఈ పథకం నిర్వహణను రైతులకు అప్పగించారు. దీంతో ఐదేళ్లపాటు సక్రమంగా నిర్వహించారు. ఆ తర్వాత కాలంలో నిర్వహణ వ్యయం పెరగడంతో పథకం మూలకుచేరింది. కాలక్ర మంలో మోటార్లు, షెడ్లు శిథిలావస్థకు చేరాయి. ఎత్తిపోతల పథకం సేవలు నిలిచిపోవడంతో ఇక్కడ రైతులు వర్షాధారంపై ఆధారపడాల్సివస్తోంది. ఈ నేపథ్యంలో ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి ఖరీఫ్‌తోపాటు రబీలో సరాళి తో పాటు చంగుడి, ఇప్పలపాడు, దశరథపురం, అంగారసింగి, తిడ్డిమి తది తర గ్రామాల పరిధిలోని మరో ఐదు వందల ఎకరాలకు అదనంగా సాగునీరందించాలని ఏళ్ల తరబడి రైతులు కోరుతున్న విషయం విదితమే. ఆయా గ్రామాలకు ఆనుకుని ఉన్న చెరువులకు అనుసంధానం చేస్తే సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు రైతులు చెబుతున్నారు.

పథకం పునరుద్ధరించాలి..


వైసీపీ పాలనలో సాగు నీటివనరులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ప్రస్తుతం సరాళి ఎత్తిపోతల పథకం పునరుద్ధరించాలి. మహేంద్రతనయ నదికి ఆనుకుని ఉన్న పథకం అందుబాటులోకి తీసుకువస్తే ఇక్కడి రైతులకు ఖరీఫ్, రబీలో సాగునీరు పుష్కలంగా అందుతుంది.
-పడాల షణ్ముఖరావు, సర్పంచ్, సరాళి

సాగు గిట్టుబాటు కావడం లేదు..


మా గ్రామానికి సమీపంలో మహేంద్రతనయ నదీ జలాలు అందుబాటులో ఉన్నా ఏటా వర్షాధారంపై ఆధారపడి సాగుచేసుకోవల్సివస్తోంది. దీంతో సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ఉత్సాహం ఉన్నా సాగు గిట్టుబా టుకాని పరిస్థితులు నెలకొన్నాయి.
-ద్వారపూడి రాజారావు, రైతు, సరాళి

ఏటా ఇబ్బందులు..


ప్రతి ఏటా పంట చివరదశకు వచ్చేసరికి నీటితడులు అందక ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఆ సమయంలో తాత్కాలికంగా బోర్లు ఏర్పాటుచేసుకొని సాగునీటికి వ్యయ ప్రయాసలు పడాల్సివస్తోంది. దీంతో సాగు వ్య యం పెరగడంతో గిట్టుబాటు కావడంలేదు.
-పడాల ప్రేమారావు, రైతు, సరాళి

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

హరిపురం: బిడిమి తీరం ప్రాంతంలో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మందస ఎస్ఐ ఖాదర్‌బాషా కథనం మేరకు.. సముద్ర తీరంలో సుమారు 40 ఏళ్లు కలిగిన యువకుడు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారాన్ని పోలీసులకు ఇవ్వడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి మృతదేహాన్ని పరిశీలించారు. సముద్రంలో కొట్టికొచ్చినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం హరిపురం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

మెళియాపుట్టి: మండలంలోని శేఖరాపురం బస్టాప్ వద్ద సోమవారం పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు.ఈ మేరకు వారి నుంచి రూ.9710 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎస్పీ


అర్జీదారులతో మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసంకార్యక్రమానికి 41 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులకు సంబంధించిన పోలీసు అధికారులకు ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి చట్టపరంగా న్యాయం చేయాలని ఆదేశించారు.

7న మద్యం దుకాణాల బంద్


డిపో మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఎచ్చెర్ల: ప్రభుత్వం ఈనెల ఆరో తేదీలోగా తమ సమస్యలపై సానుకూలంగా స్పందించకపోతే ఈనెల ఏడో తేదీన మద్యం దుకాణాల వద్ద బంద్ పాటిస్తామని ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.ఈమేరకు సోమవారం ఎచ్చెర్లలోని ఐఎంఎల్ డిపో మేనేజర్ సుబ్బారావుకు అసోసియేషన్ ప్రతినిధులు పి.రామచంద్రరావు, ఎస్.భాస్కర్, జి.కోటేశ్వరరావు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నూతన మద్యం విధానంలో భాగంగా ప్రైవేటు వ్యక్తులకు షాపులు అప్పగించడాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.ఇప్పటికే సంఘం తరపున ముఖ్యమంత్రికి రాసిన లేఖలో తమ సమస్యను వివరించామని తెలిపారు. ప్రైవేటు వైన్‌షాపుల వల్ల తామంతా ఉపాధి కోల్పోతామని ఆందోళన వ్యక్తంచేశారు.

ఇచ్ఛాపురంలో ట్రాఫిక్ ఇక్కట్లు


వీకేపేట రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

ఇచ్ఛాపురం: పట్టణంలోని దానన్నపేట, వీకేపేట తదితర జంక్షన్లల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ఇక్కడ వివిద రకాల సరకులు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండడంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. ఉదయం ఎనిమిది లోపు, రాత్రి ఎనిమిది గంటల తర్వాత లారీల నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకోకపోతే చర్యలు తీసుకుంటామని పోలీసుల హెచ్చరికలు సైతం వ్యాపారులు బేఖాతర్ చేస్తున్నారని పలువురు వాహనచోదకులు చెబుతున్నారు.

నిచ్చెనకు తుప్పుపట్టి.. పిచ్చిమొక్కలు పెరిగి

- శుభ్రంచేయడానికి అవస్థలు
- ఇదీ గార ఓవర్‌హెడ్ ట్యాంకు దుస్థితి

గార:గారలోని సంతమైదానం వద్ద ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్వహణ గాడితప్పింది. ప్రధానంగా పంచాయతీఅధికారులు నిర్లక్ష్యం పుణ్యమాని ట్యాంకుపైకి ఎక్కే నిచ్చెన తుప్పుపట్టింది. దీనికితోడు నిచ్చెన చుట్టూ పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. తరచూ ట్యాంకు శుభ్రంచేసి పరిశుభ్రమైన నీటిని ప్రజలకు సరఫరాచేయాల్సిఉంది. అయితే నిచ్చెన ఎక్కేందుకు వీల్లేకపోవడంతో శుభ్రంచేయడానికి అవకాశంలేదని పలువురు గ్రామస్థులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ట్యాంకు క్లీనింగ్ చేయడానికి సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. శాలిహుండాం ప్రాజెక్టు పరిధిలో ప్రాజెక్టు 50 వేల లీటర్ల సామర్థ్యంతో గార సంతమైదానం వద్ద ఓవర్ హెడ్ ట్యాంకు రెండు దశాబ్దాల కిందట ఏర్పాటుచేశారు. ఈపథకం నుంచి గార ప్రజలకు తాగునీరందుతోంది. ఓవర్‌హెడ్ ట్యాంకు నిచ్చెనను కొత్తది ఏర్పాటుచేసి, పిచ్చిమొక్కలు తొలగిం చాలని పలువురు కోరుతున్నారు.


ఓవర్ హెడ్ ట్యాంక్ నిచ్చెనకు అల్లుకున్న పిచ్చిమొక్కలు

అర్హులకు పింఛన్లు అందజేయండి

ఇచ్ఛాపురం: అర్హులైన లబ్ధిదారుల పింఛన్లు తొలగించడం తగదని, వారికి యధావిదిగా అందజేయాలని ఎమ్మెల్సీ నర్తు రామరావు కోరారు. సోమవారం ఎంపీడీవో ఎం.ఈశ్వరరావును పింఛన్ల తొలగింపుపై ప్రశ్నించారు. మశాఖపురానికి చెందిన ఆరుగురు, బాలకృష్ణాపురానికి చెందిన ఒకరి పింఛన్ తొలగించారని తెలిపారు. ఎమ్మెల్యే అశోక్ ఫిర్యాదు మేరకు ప్రస్తుతానికి నిలిపి వేసామే తప్పా తొలగించలేదని, విచారణ తరువాత అర్హులైతే అందజేస్తామని ఎంపీడీవో చెప్పారు.

నిష్పక్షపాతంగా విచారణ చేయాలి

శ్రీకాకుళం క్రైం: రణస్థలం మండలంలోని సీతవలసకు చెందిన ధర్మాన ఈశ్వరరావు చిన్న కుమారుడు రమేష్ మృతికి కారకులను శిక్షించాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరారు. సోమవారం శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానందను కలిశారు. నిష్పక్షపాతంగా విచారణచేసి, న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.

ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలి

ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధిలోని వర్తకులు ప్లాస్టిక్ కవర్లు నిషేధాన్ని పాటించాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ కోరారు. సోమవారం పట్టణంలోని చికెన్, మటన్ చేపల వర్తకులతో సమావేశం ఏర్పాటు చేశారు. 120 మైక్రాన్‌ల కంటే ఎక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బి.సృజన, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ హనుమతు, వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

ఇచ్ఛాపురం:వినాయకమండపాలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని సీఐ మీసాల చిన్నామనాయుడు తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురంలో విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. పతిషాపు యజమాని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

●**ఆమదాలవలస:** వినాయక మండపాల అనుమతుల కోసం ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలుచేస్తోందని సీఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఆమదాలవలసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీస్, మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. మండపాల అనుమతి కోసం 7995095800 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా హాని సందేశం పంపించాలని కోరారు. సమావేశంలో ఎస్ఐ కె.వెంకటేష్ పాల్గొన్నారు.

వైఎస్‌కు నివాళి

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి వైసీపీ, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. సోమవారం వైఎస్ వర్ధంతి పురస్కరించుకుని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వైఎస్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఆంధ్రజ్యోతి బృందం


కంచిలి: వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పిరియా సాయిరాజ్


రణస్థలం: వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గొర్లె కిరణ్‌కుమార్


పలాస: కిడ్నీ ఆసుపత్రి వద్ద వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీదిరి అప్పలరాజు


టెక్కలి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


ఎల్ఎన్‌పేట: వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ఆమదాలవలస: మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం

వైఎస్ వర్ధంతికి ధర్మాన దూరం

- వైసీపీ వర్గాల్లో చర్చనీయాంశం

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలిలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు దూరంగా ఉన్నారు. ఈ కార్యక్రమానికి ఆయన గైర్హాజరు కావడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారం కోల్పోయిన అనంతరం శ్రీకాకుళం నియోజకవర్గంలో ధర్మాన ప్రసాదరావు క్యాడర్‌కు దూరంగా ఉండడంపై కొందరు కృష్ణదాస్ వద్ద ప్రస్తావించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సైతం మంత్రి పదవిరాకపోవడంతో బంగ్లాకే ధర్మాన ప్రసాదరావు పరిమితమయ్యారని విమర్శలు ఉన్న విషయం విదితమే. శాసనసభఎన్నికల్లో ఓటమితర్వాత కూడా బంగ్లా దాటి బయటకు రావడంలేదని కొందరు కార్యకర్తలు చెబుతున్నారు.అయితే ధర్మాన ప్రసాదరావు పార్టీపై విముఖతతో ఉన్నారని, అందుకే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.


శ్రీకాకుళంలో వైఎస్ వర్ధంతిలో పాల్గొన్నవైసీపీ నాకులు

ప్రజలు మెచ్చిన నాయకుడు వైఎస్

అరసవల్లి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలు మెచ్చిన నాయకుడని శ్రీకాకుళం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు అంబటి కృష్ణారావు తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(మీ కోసం)లో వచ్చిన అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ 132 అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి సంతృప్తి చెందేలా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కోరారు. అర్జీలు రీఓపెనింగ్‌కు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వైపరీత్యాలపై ముందస్తు చర్యలు చేపట్టాలి

ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు చర్యలను తీసుకోవాలని అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు.జడ్పీ కార్యాలయంలో ఆయన అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో తుఫాన్ తీరం దాటుతుందన్న సమాచారం తప్ప, ఇక్కడ ఆ స్థాయిలో తుఫాన్, వర్షప్రభావం లేదని, సరైన సమాచారం అందజేయకపోవడంతో చిన్నపాటి సమస్యలు ఉత్పన్నమయ్యిందని తెలిపారు.ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో ప్రతిఒక్కరూ చేపట్టాల్సిన విధులపై తరచూ శిక్షణలు నిర్వహించాలని తెలిపారు.కంట్రోల్‌రూమ్ నుంచి వెంట వెంటనే నివేదికలు సిద్ధం చేసేలా పూర్తిస్థాయి వ్యవస్థను సిద్ధం చేసుకోవాలని కోరారు.


మీకోసంలో అర్జీని స్వీకరిస్తున్న స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రైతులను చైతన్య వంతులుచేయాలి

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులను చైతన్యవంతులను చేయాలని కలెక్టర్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ పొలం పిలుస్తోంది ప్రచార పోస్టర్‌ను వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కె.శ్రీధర్‌తో కలిసి ఆవిష్కరించారు.


మట్టి పోసి.. శుభ్రం చేశారు


గారలో ప్రభుత్వ కార్యాలయాలు ఎదుట గ్రావెల్ వేసి ఎత్తుచేస్తున్న కార్మికులు

గార: గారలో సంతమైదానం వద్ద ఉన్న మండలపరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో సోమవారం క్రషర్ మట్టివేసి శుభ్రంచేశారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో బురదమయమైన ప్రభుత్వ కార్యాలయాలు శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో ఎంపీపీ గొండు రఘురామ్, అధికారులు స్పందించారు. ఈమేరకు రెండు కార్యాలయాలు ఎదుట మట్టితో ఎత్తు చేయించి బురద లేకుండా రాకపోకలకు అనువుగా మార్చారు.

వరం పేరుతో మరిన్ని సేవలు

- వర్ధంతి కార్యక్రమంలో కళింగ కోమటి సంఘ నాయకుల నివాళి


వరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘ ప్రతినిధులు

అరసవల్లి: వరం పేరిట మరిన్ని సేవలను విస్తృతం చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని కళింగవైశ్య కళ్యాణ మండపంలో మునిసిపల్ మాజీ చైర్మన్ అంధవరపు వరహానరసింహం(వరం) వర్ధంతిని నగర కళింగకోమటి సంఘం ఆధ్వర్యంలో పట్టణాధ్యక్షుడు ఊణ్ణ నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు.ఈసందర్భంగా సంఘరాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు మాట్లాడుతూ వరం జాతిఐక్యతను కాపాడుతూ విశేష సేవలు అందించి కళింగవైశ్య జాతిగౌరవాన్ని పెంచారన్నారు.కళింగవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ వరం కేవలం జాతి కోసమేకాకుండా శ్రీకాకుళం ప్రజల సంక్షేమం,అభివృద్ధికోసం శ్రమించారన్నారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తున్నామన్నారు. అనంతరం దివ్యాంగులకు వీల్‌చైర్లను అందజేశారు. కార్యక్రమంలో కళింగవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తంగుడు జోగారావు, వరంతనయులు అంధవరపు ప్రసాద్, అంధవరపు సంతోష్, సంఘ పెద్దలు కోణార్క్‌శ్రీను, కోరాడ రమేష్, అంధవరపు రఘు, గోవింద రాజులు, బరాటం నాగేశ్వరరావు, కోరాడ హరగోపాల్, పివి రమణ, తంగుడు నాగేశ్వరరావు, సర్వేశ్వరరావు, వైశ్యరాజు చంద్రమౌళిరాజు, జామి భీమశంకర్ పాల్గొన్నారు.

అడంగల్ సమస్య పరిష్కరించాలి

సోంపేట: కొర్లాం పంచాయతీ అగ్రహారం చెరువుకు సంబంధించి సర్వే నెంబర్ 90 నుంచి 110 వరకు అడంగల్ సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ అప్పలస్వామికి గ్రామస్థులు సోమవారం వినతిపత్రం అందజేశారు.అడంగల్, ఆర్‌వోఆర్,1బీ రాకపోవడంతో ఈ-క్రాప్ నమోదు కావడంలేదని తెలిపారు. దీంతో ఎరువులు అందడంలేదని పేర్కొన్నారు.

సత్యసాయి సంస్థలకు శంకర్ ఫౌండేషన్ అవార్డు

పొందూరు:పొందూరు సత్యసాయి సేవాసంస్థలు కంటిరోగులకు అందించిన సేవలకు గాను శంకర్‌ఫౌండేషన్ సంస్థ అవార్డును ప్రదానం చేసింది.ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకులు ఆత్మకూరి శంకరరావు జయంతి పురస్కరించుకుని విశాఖలో సోమవారం ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును పొందూరు సత్యసాయి సంస్థ కన్వీనర్ డి. రాధాకృష్ణ, సభ్యులు పి. నానాజీలకు అందజేశారు.

హైందవ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

రణస్థలం:హైందవ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని ధర్మప్రసార సంయోజిక్ పొగిరి సూర్యనారాయణ, ఆర్ఎస్ఎస్ విభాగసేవా భారతి పిలుపునిచ్చారు. సోమవారం రణస్థలంలోని శ్రీకృష్ణ చైతన్య మఠం గోశాల ప్రాంగణంలో ప్రఖండ అధ్యక్షుడు కిల్లారిశేఖర్ ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ 60 సంవత్సరాల వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా విశ్వహిందూ పరిషత్ సాధించిన విజయాలు, చేయబోయే కార్యక్రమాల కోసం వివరించారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

శ్రీకాకుళం అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలని ప్రజారోగ్యాధికారి డాక్టర్ పి.సుధీర్‌కుమార్ తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని మార్కెట్‌లోని పలు దుకాణాల్లో కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వ్యాపారులకు నోటీసులు జారీచేశామని, ఇకపై ట్రేడ్ లైసెన్స్‌లకు దరఖాస్తు చేయని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యుద్ధాలతో అభివృద్ధికి విఘాతం

ఎచ్చెర్ల:యుద్ధాలతో అభివృద్ధికి విఘాతం కలుగుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు తెలిపారు. సోమవారం ఎచ్చెర్లలో సీఐటీయూ నేతలు అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని, పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడిని వ్యతిరేకిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు డి.బంగార్రాజు, టి.రామారావు, ఎల్.రాము, వి.రాజు, ఎస్.రమణ పాల్గొన్నారు.



ఎచ్చెర్లలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

ఓపీఎస్ అమలు చేయాలి

పొందూరు: పాత ఓపీఎస్‌ను అమలు చేయాలని ఏపీటీఎఫ్ నాయలు కోరారు.ఈ మేరకు సోమవారం డీటీ వైకుంఠరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు రమణరావు, రాష్ట్రకౌన్సిలర్ కె.విజయకుమార్, జవహర్‌గుప్త పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బూర్జ: వర్షాలు కురుస్తుండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇంజనీరింగ్ అధికారులు కోరారు. సోమవారం మండలంలోని అల్లెన, జేబీపురం, బూర్జ గ్రామాల పరిధిలో నాగావళి తీర ప్రాంతాల్లో కరకట్టల పరిస్థితిని పరిశీలించారు. కార్య క్రమంలో ఈఈ హెచ్.మన్మథరావు, డీఈఈ రమేష్, ఏఈఈలు కార్తీక్, యశ్వంత్, చంద్రశేఖర్, నాయకులు వాడాడ రాంబాబు, గోవిందరావు పాల్గొన్నారు.

అరసవల్లిలో వనమహోత్సవం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోగల ఇంద్రపుష్కరిణి పరిసరాల్లో దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈవో డీఎల్‌వీ రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆలయప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ అర్చకులు, సిబ్బంది ఔషధ గుణాలు గల ఉసిరి, రావి, నేరేడు, శ్రీగంధం, సీత, మారేడు, తెల్లమద్ది, కదంబం, వెలగ, చింత, వేప, ఎర్రచందనం, అశోక, దేవకాంచనం, మామిడి, జమ్మి, సీతాఫలం మొక్కలను నాటారు.

జ్వరపీడితుల గుర్తింపునకు సర్వే

ఆమదాలవలస:సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తొగరాం పీహెచ్‌సీ వైద్యురాలు మెట్ట స్రవంతి తెలిపారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని పలుగ్రామాల్లో జ్వర పీడితులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేపట్టారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ మల్లిబాబు పాల్గొన్నారు.